సలీం

కథ

# జన్నిదం

ఆదివారం ఉదయం...

రాణి చేసిన గోధుమరవ్వ ఉప్మా తిని, రాకింగ్ చెయిర్లో కూచుని ఊగుతూ తిలక్ కథలు చదువుతున్న మధురమైన సమయం...

''మనం షాపింగ్‌కెళ్లాలి. తయారుకండి'' అంది రాణి.

''ఏం కొనాలి? ఇంట్లో అన్నీ ఉన్నాయిగా''

''మీరు హాయిగా కాలుమీద కాలేస్కుని కూచుంటే అన్నీ మనింటికి నడుచుకుంటూ వస్తాయనుకున్నారా? ఒక్కసారి వంటగదిలోకొచ్చి చూడండి. కూరగాయల్లేవు. ఏం వండమంటారు? ముద్దపప్పు చేసి, అప్పడాలు వేయించమంటారా? మీ ఇష్టం. మీకు ముద్దపప్పంటే ఇష్టం కదా'' ముసిముసిగా నవ్వింది రాణి.

ముద్దపప్పు దగ్గర వత్తి పలకటం నేను గ్రహించలేననుకుందేమో.. నాకు తిలక్ సాహిత్యమంటే ఎంత ఇష్టమైనా ఎత్తిపొడుపుల్ని అర్థం చేసుకోలేనంత మైకంలో లేను.

''ఏయ్... ఏంటీ ముద్దపప్పంటున్నావ్? మొగుణ్ని అలా అనకూడదని తెలీదా? మా ముస్లింలలో భర్తని ఎంత గౌరవంగా పిలుస్తారో తెలుసా?''

''మళ్లీ పప్పులో కాలేశారు... ఊర్కెనే అన్నానా ముద్దపప్పని... సైపుల్లా సాబ్... ఏ మతంలోనైనా భర్తల్ని గౌరవంగానే పిలుస్తారు. ముస్లిం ఇళ్లల్లో భార్యని కూడా జీ అనో బేగం అనో గౌరవిస్తారు. ఆ రకంగా మీరు నన్ను కూడా మీరనే పిలవాలి. గుర్తుపెట్టుకోండి''

''అవును కదూ... చాలా బాగా చెప్పావు రాణి''


''పొగడ్త చాలు గానీ బయల్దేరండి. బడీచౌడీలో కూరగాయలు కొనాలి. వాటితోపాటు కొనాల్సిన మరో ముఖ్యమైన వస్తువుంది. ఏంటో చెప్పుకోండి చూద్దాం''

''అన్ని రకాల కూరగాయల్లోకి అవసరమైన కొత్తిమీర... కరివేపాకు''

''అవీ కూరగాయలకిందకే వస్తాయండీ. రేపు శ్రావణ పూర్ణిమ... మర్చిపోయారా?''

''రేపు రాఖీ పండగ కదా''

''శ్రావణ పూర్ణిమనే రాఖీపూర్ణిమ అని కూడా అంటారు. నేనో రాఖీ కొనాలి. ప్రతి యేడూ రాఖీ



పండగ నాడు పరమహంసకి రాఖీ కడతాను కదా. వాడు రేపు మనింటికొస్తానని ఫోన్ చేసి చెప్పాడు''

''కూరగాయలు కొంటానికి నేనెందుకు చెప్పు? నన్ను చదువుకోనివ్వొచ్చుగా. ఆటోలో ఎంచక్కా వెళ్లి రావొచ్చుగా. బడీచౌడీలో పార్కింగ్ పెద్ద తలనొప్పి తెలుసా?''


''తెలుసు... ఆటోవాళ్లతో కూడా తలనొప్పని మీకు తెలీదా... ఆ పుస్తకం మీరు గీతాపారాయణంలా రోజూ చదివేదేగా.. లేవండి.. మీరేమీ స్కూటర్ని పార్క్ చేయక్కరలా. మీరు స్కూటర్ దగ్గరే నిలబడి ఉండండి. నేను కావల్సినవి కొనుక్కుని వస్తాను''

రాణి వేసిన ఆర్డరాయె... తప్పుతుందా, లేచి రెడీ అయ్యాను.

ఆదివారమైనా బడీచౌడీ మార్కెట్ బిజీగా ఉంది. స్కూటర్ ఆపుకుని దాని పక్కనే నిలబడ్డాను. రాణి మొదట కూరగాయల బండి దగ్గరకెళ్లింది. ఏం చేయాలో తోచక వచ్చేపోయే జనాల్ని పరిశీలిస్తూ నిలబడ్డా.

హైద్రాబాద్ వచ్చిన కొత్తలో సుల్తాన్‌బజార్, బడీచౌడీ మార్కెట్లు చూసినప్పుడు ఎంతాశ్చర్యమేసిందో... నా చిన్నప్పుడు శింగరాయకొండ జాతర్లో చూశానంత మంది జనాల్ని. ప్రవాహంలా జనం...పిన్నీసులు, రిబ్బన్ల దగ్గర్నుంచి పట్టుచీరలు, పరుపుల వరకు ఇక్కడ దొరకని వస్తువంటూ లేదు. ఆడవాళ్లు రంగురంగుల బట్టల్లో హడావిడిగా తిరిగేస్తున్నారు. వాళ్ల మొహాల్లో మెరుస్తూ సంతోషం... షాపింగ్ చేయడం కూడా మత్తే... బాగా కిక్కిచ్చే మత్తు..

''అయ్యా... జంధ్యం కావాలా? ఒక్కటే ఐదు రూపాయలే'' అని విన్పిస్తే తల తిప్పి చూశాను. చిన్నప్పుడు తెలుగువాచకంలో బడుగు బ్రాహ్మడు అని చదువుకున్న వ్యక్తి ప్రాణం పోసుకుని ఎదురుగా నిలబడినట్టు అనిపించింది. అరవైకి పైబడిన వయసు.. బలహీనమైన శరీరం... విల్లులా వంగిన దేహం... లోతుకుపోయి వీపుకతుక్కుపోయిన పొట్ట... కళ్లలో దైన్యం. కానీ మొహంలో ఓ వింత తేజస్సు. నీరుకాయపట్టిన ధోవతి... నడుం పైన జంధ్యం పోగు తప్ప అనాచ్ఛాదితంగా ఉన్న శరీరం...



## కలిసిరాని కాలం!

బాలీవుడ్‌లో ఫరాఖాన్ లాంటి కొరియోగ్రాఫర్‌ల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసి తెలుగులో 'ప్రేమాయనమః' సినిమాతో హీరోయిన్‌గా పనిచేసిన కౌషకి ఐటమ్ సాంగ్‌లు తప్ప హీరోయిన్ వేషాలు రాకపోవడం చూస్తే, కేవలం గ్లామర్ వుంటే సరిపోదు, అదృష్టం కూడా కలిసి రావాలి అని తప్పక అనిపిస్తుంది. అందచందాలు ఆరేయడంలో పెద్దగా అభ్యంతరాలు కనబర్చని కౌష- దర్శకుడి సూచనల మేరకు ఆ పాత్రకి అవసరమైనప్పుడు బికినీలో నటించినా కిస్సింగ్ సీన్ చేసినా తప్పులేదు అంటూ సెలవిచ్చిందీమధ్య. అలాగైనా నలుగురి దృష్టిలోకీ వస్తుందేమో!

''యజ్ఞోపవీతం పరమ పవిత్రం. రేపు పవిత్రమైన రోజు.. జంధ్యాల పూర్ణిమ బాబూ. ఒక జంధ్యం ఇవ్వమంటారా? రెండివ్వమంటారా?''

నాకేమని చెప్పాలో తెలీలేదు. ఆ వయసులో కూడా జంధ్యాలమ్ముకుని బతకాల్సిన అతని పరిస్థితిని తల్చుకుంటే గుండె తరుక్కుపోయింది. అలాగని జంధ్యం కొనుక్కుని ఏం చేయనూ? పోనీ మేము ముసల్మానులం అని చెప్పేస్తేనో... నన్ను జంధ్యం కొనమని అడిగినందుకు నొచ్చుకుంటాడేమోనని సంశయం... జంధ్యం కొనకపోగా అతన్ని బాధ పెట్టడం ఏం భావ్యం?

నా మౌనాన్ని అతను మరోలా అర్థం చేసుకున్నాడల్లే ఉంది.

''యజ్ఞోపవీతం సృష్టికర్త అయిన బ్రహ్మతో పాటే పుట్టింది. ఇది ధరించటం వల్ల ఆయుష్షు పెరుగుతుంది. బలం, తేజస్సు ఇనుమడిస్తాయి. వద్దనకు బాబూ, ఒక్కటైనా కొను'' అన్నాడు.

నాకతని కుటుంబం గురించి తెలుసుకోవాలన్న కోరిక... అతన్నీ స్థితికి నెట్టిన కారణాల్ని వెతికి పట్టుకోవాలన్న కోరిక...

''మీ వయసెంత?'' అని అడిగాను.

అతనో క్షణం నా మొహంలోకి వింతగా చూసి, ఏమనుకున్నాడో ఏమో ''అరవై ఏడేళ్లు బాబూ'' అన్నాడు. అలా అంటున్నప్పుడతని కళ్లలో మర్రి వూడల్లా నీలినీడలు...

మిట్టమధ్యాహ్నపు ఎండవల్లనో,

అధిక శ్రమ వల్లనేమో అతని చెంపల మీంచి కారుతున్న చెమట... ఉదయం ఏమైనా తిన్నాడో లేదో... అతని మాటల్లో స్పష్టంగా తెలుస్తోన్న అలసట...

''ఈ వయసులో ఇంత కష్టపడుతున్నారే... మీ పిల్లలు...'' అంటూ ఆగిపోయాను.

''జాలిపడుతున్నావా బాబూ... వద్దు. జాలి నిప్పులా కాల్చేస్తుంది. నా పిల్లలు నన్ను చూసినా చూడకున్నా నా పిల్లలే. వాళ్ల తండ్రిగా నేను వాళ్ల గురించి చెడు మాట్లాడలేను. నా ప్రారబ్ధాన్ని తిట్టుకుంటాను తప్ప నా పిల్లల్ని పల్లెత్తుమాటనను. పూర్వజన్మ సుకృతాల, అకృత్యాల ఫలితాన్ని ఎవరికైనా అనుభవించక తప్పదుగా బాబూ''

''ఇలా జంధ్యాలమ్మితే వచ్చే డబ్బు మీకు సరిపోతుందా?''

''సరిపెట్టుకోవాలి బాబూ. రోజంతా తిరిగి అమ్మితే ఇరవయ్యో పాతికో మిగుల్తాయి. నాకూ నా భార్యకు ఇదే జీవనాధారం. ఇంతకీ ఒకటిమ్మంటారా రెండిమ్మంటారా?''

''సారీ అండీ.... నాకవసరం లేదు'' అన్నాను ఎలాగోలా గొంతు పెగల్చుకుని.

కొనకపోగా అతని సమయాన్ని వృథా చేశానని తిడ్తాడేమోననుకున్నా. కనీసం నిరసనగా చూస్తాడనుకున్నా. అవేమీ లేకుండా ''పర్లేదు బాబూ'' అంటూ అతను నన్ను దాటుకుని ముందుకెళ్లాడు.

''బాబాయిగారూ... ఓ క్షణం'' ఎప్పుడొచ్చిందో రాణి నా పక్కన నిలబడి ఆయన్ని కేకేసి పిలిచింది.

''జంధ్యాలు కావాలా తల్లీ'' అంటూ వెనక్కొచ్చాడతను.

''కావాలి బాబాయిగారూ'' అంటూ నావైపు తిరిగి, ''మీ జంధ్యం పోగు తెగిపోయింది కదండీ. జంధ్యం మార్చుకోవాలిగా. వద్దని పంపించారేం.. రేపు జంధ్యాల పూర్ణిమ కూడానూ'' అంది.

తనేమంటుందో నాకర్థం కాక మిన్నకుండిపోయాను.

''ఎన్ని కావాలమ్మా'' అన్నాడతను.

''చాలా కావాలి బాబాయిగారూ. ఈయనగారి కోసం ఒకటి... మా నాన్నగారి కోసం ఒకటి...నా తమ్ముడి కోసం మరొకటి...''

అతను మూడు జంధ్యాల్ని లెక్కపెట్టి పక్కకు తీసి రాణికిస్తూ ''ఒక్కటి ఐదు రూపాయలు తల్లీ... మూడు తీసుకుంటున్నావు కాబట్టి పన్నెండు రూపాయలిస్తే చాలు''

మూడు జంధ్యాల్ని తీసుకుని రాణి తన బ్యాగులో పెట్టుకుంది. ''బాబాయిగారూ.. జంధ్యానికీ గాయత్రీదేవికి ఉన్న సంబంధం చెప్తారా? తెల్సుకోవాలని ఉంది'' అంది.

''తప్పకుండా తల్లీ. యజ్ఞోపవీతం సాక్షాత్తూ గాయత్రి మాత ప్రతీక. యజ్ఞోపవీతంలో మూడు పోగులుంటాయి. గాయత్రి మంత్రంలో మూడు పాదాలుంటాయి''

''బాగా చెప్పారు. మీరలా చెప్తుంటే నాకు మా నాన్నగారు చెప్తున్నట్లే ఉంది. మీ దగ్గర ఇంకెన్ని జంధ్యాలు మిగిలాయి?''

అతను తన దగ్గర మిగిలిన జంధ్యాల్ని లెక్కపెట్టి చెప్పాడు. ''పాతిక మిగిలాయి తల్లీ. చీకటిపడే వరకు తిరిగి అమ్మితే కనీసం ఇరవై అమ్ముడైనా చాలు''

''ఆ మిగిలిన జంధ్యాలూ నాకే కావాలి బాబాయ్''


''పాతిక జంధ్యాలా.... అన్ని ఏం చేసుకుంటావు తల్లీ?''

''అయ్యో బాబాయిగారూ.. మీకీయన విషయం చెప్పలేదు కదూ.. పసిపిల్లాడి కన్నా అధ్వాన్న మంటే నమ్మండి. వారానికో జంధ్యం తెంపేసి పోగులు పెడ్తుంటారు. అందుకే ఎన్ని కొనిపెట్టినా ఇంకా తక్కువే''

అతను నా వైపు చూసి మృదువుగా నవ్వాడు. తన దగ్గరున్న జంధ్యాలన్నీ రాణికివ్వబోయి ఆగిపోయాడు. ''నువ్వు నా మీద జాలితో ఇవన్నీ కొనటం లేదు కదా''


''మీమీద జాలి పడాల్సిన అవసరం ఏముంది బాబాయిగారూ? దర్జాగా మీ స్వశక్తి మీద ఆధారపడి బతుకుతున్నారు. ఈ వయసులో కూడా శ్రమను నమ్ముకుని బతుకుతున్నారు తప్ప ఆత్మాభిమానాన్ని అమ్ముకుని బతకటం లేదు. మీరు చాలా మందికి ఆదర్శం బాబాయిగారు. మిమ్మల్ని చూసి మీ వాళ్లందరూ గర్వపడాలి. నాకు నిజంగా అవసరం ఉండే కొంటున్నా''

ఆ మాటలకేమో అతని కళ్లు చెమ్మగిల్లాయి. జంధ్యాల్ని రాణికిచ్చి అతను కళ్లు తుడుచుకున్నాడు. కన్నీళ్లతో తడిచిన అతని కళ్లల్లో ఇప్పుడు




## సల్మాన్ పిలుపు!

కండల వీరుడు సల్మాన్ ఖాన్ ఈమధ్య 'బోన్‌మేరో'ని దానం చేయండని జనాలకి పిలుపునిచ్చాడు. కాన్సర్, తలసేమియా లాంటి భయంకరమైన వ్యాధుల చికిత్సలో ఇది ఎంతగానో ఉపకరిస్తుందనీ తను కూడా బోన్‌మేరోని దానం చేయదల్చుకున్నట్టు సెలవిచ్చాడు. నిన్నమొన్నటి దాకా ఎంతో దూకుడుగా కనిపించిన సల్మాన్‌లో వయసు పైబడుతున్న లక్షణాలు కనిపించడం లేదూ! ఆ మార్పుల్లో భాగమే ఈ సమాజసేవలు, సందేశాలూ!



నీలినీడలు లేవు... ధవళకాంతితో మెరుస్తూ సంతృప్తి కనిపించింది. గొణుగుతున్నట్టుగా ''శతమానం భవతి... సౌభాగ్యవతిగా వర్ధిల్లు తల్లీ'' అంటూ దీవించాడు.


రాణి నూ(రూపాయల నోటు, యాభై రూపాయల నోటు అతని చేతికిచ్చింది.

''మొదటిచ్చిన మూడు జంధ్యాలకి పన్నెండు రూపాయలు. ఇప్పుడు తీసుకున్న పాతిక్కి వంద రూపాయలు... మొత్తం నూట పన్నెండు రూపాయలు. మీకింకా ముప్పై ఎనిమిది రూపాయలు వస్తాయి'' అంటూ చిల్లర లెక్కపెడుతున్నాడు.

నేను వెంటనే ''చిల్లర ఇవ్వక్కరలేదు. ఉంచుకోండి'' అన్నాను.

అతను చివ్వున తలెత్తి నా వైపు తీక్షణంగా చూశాడు. ''నా ఒంట్లో శక్తి ఉన్నంతకాలం కష్టపడి నన్నూ నా భార్యనీ పోషించుకుంటా. సత్తువ లేని రోజు ప్రాయోపవేశం చేసి ఇద్దరం ప్రాణాలైనా వదుల్తాం కానీ ఎవరి ముందూ చేయి చాపి మాత్రం బతకను''

నేను తప్పుగా మాట్లాడానని అర్థమై, సరిదిద్దుకునే ప్రయత్నంలో ''అలా ఎందుకనుకుంటారు? మీ అబ్బాయి ఇస్తే తీసుకోరా? అలానే అనుకోండి'' అన్నాను.




''తీసుకోరు. నాకు తెలుసు. బాబాయిగారి మొహంలో కన్పిస్తున్న తేజస్సు చూశారా? ఆత్మాభిమానం వల్ల వచ్చిన తేజస్సది'' అంది రాణి అతనిచ్చిన చిల్లర తీసుకుంటూ.

''చాలా బాగా చెప్పావు తల్లీ'' అన్నాడతను.

రాణి నమస్కరించింది. నేనూ అప్రయత్నంగానే చేతులు జోడించా. ''శతాయుష్మాన్ భవ'' అని దీవించి వెళ్లిపోయాడతను.

ఇంటికి తిరిగొచ్చాక వాటిని బైటికి తీస్తూ ''ఎన్ని జన్నిదాలో'' అంది రాణి.

''జన్నిదాలా? అంటే ఏమిటి?''

''పత్తితో దారం చేసి మూడు వరుసలు కలిపి వాటిని గుణించి తాల్చిన ఒక సూత్రాన్ని మళ్లీ మూడు వరుసలు చుట్టి దానికి ఒక ముడి వేస్తే జన్నిదం తయారవుతుంది. ఆ ముడిని బ్రహ్మగ్రంధి అంటారు. తెలిసిందా జనాబ్ సైపుల్లా'' అంది అల్లరిగా.

''ఓ అలానా... నాకు తెలీని విషయాన్ని వివరించినందుకు థ్యాంక్స్. సరేగానీ అన్ని జంధ్యాలు ఏం చేస్తావు?'' అని అడిగా.

''మీ కోసమే''

''నా కోసమా? నేనేం చేసుకుంటాను?''

''వేసుకోండి...రోజుకోటి. మీరు వేసుకుంటే చూడాలని ఉందండీ. ప్లీజ్ నా కోసం'' అంది రాణి సరదాగా.

హమ్మయ్యా, నిజంగా వేసుకోమనడం లేదు. వేళాకోళానికే అంటోందని అర్థమైంది. ఆమె చిలిపినవ్వునే మైమరిచి చూస్తూ ఉండిపోయా.

☆



## సోనమ్ ఫైట్లు

బాలీవుడ్ కుర్రతార సోనమ్ కపూర్ తను నటిస్తున్న 'ప్లేయర్స్' అనే సినిమాలో బోల్డన్ని యాక్షన్ సీన్లలో నటిస్తున్నట్టు గొప్పగా చెప్పుకుంటోంది. ఈ సినిమా చాలావరకు యాక్షన్ ప్యాక్డ్‌గా వుంటుందిట. మరో హీరోయిన్ బిపాషా బసు కూడా ఫైట్లు చేస్తుందిట. అయితే ఇద్దరిలో తనే బెస్ట్ అనిపించుకునే ప్రయత్నాలు చేస్తోందిట సోనమ్. కార్ల చేజ్‌లు, భయంకరమైన ఫైట్లు చాలావరకు స్వయంగానే చేస్తోందిట సోనమ్. డూప్ లేకుండా తనేంటో నిరూపించుకోవాలనుకుంటోందిట. మరి ఈ సినిమా సోనమ్‌కి ఎంత గుర్తింపు తెస్తుందో!